
సాక్షి తూర్పుగోదావరి

ఆదివారం । 11 । జూన్ । 2023



రామాలయానికి విరాళం

ఉప్పలగుప్తం: మండలంలోని పేరాయిచెరువులో రామాలయ నిర్మాణానికి మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కుంచే రమణారావు శనివారం రూ.25 వేల విరాళాన్ని అందించారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: బ్యారేజి నుంచి శనివారం తూర్పు డెల్టాకు 2000 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1300 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 4000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం 44.5° / 27.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	44.5	30.0
కాకినాడ	41.9	30.1
అమలాపురం	40.0	27.0

నమూనా ఆలయ నిర్మాణానికి టెండర్ ఖరారు

ఆరు నెలల్లో నిర్మాణం పూర్తికి కాంట్రాక్టర్ అంగీకారం



నమూనా ఆలయానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ తదితరులు (ఫైల్)

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని భక్తులకు శుభవార్త. మరో ఆరు నెలల్లో విశాఖపట్నం–రాజమహేంద్రవరం వైపున జాతీయ రహదారిపై సత్యదేవుని నమూనా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను దర్శించే అవకాశం కలగనుంది. ఇందుకు స్వామివారి ఆలయం, ఇతర నిర్మాణాలకు ఉద్దేశించిన టెండర్ 3.95 శాతం ఎక్కువగా సుమారు రూ.3.57 కోట్లకు ఖరారైంది. దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ శనివారం ఈ విషయం తెలిపారు. సత్యదేవుని డిగ్రీ కళాశాల సమీపంలో దేవస్థానానికి గల 70 సెంట్ల స్థలంలో స్వామివారి నమూనా ఆలయం, ప్రసాదం కౌంటర్, ఫుడ్ ప్లాజా, టాయిలెట్ బ్లాక్ నిర్మించేందుకు గత నెలలో రూ.3.44 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ పిలిచారు. టెండర్లను శుక్రవారం తెరిచారు. అంచనా వ్యయం కన్నా 4.95 శాతం ఎక్కువకు కోట్ చేసిన టెండర్ తక్కువదిగా నిలిచింది. మళ్లీ రివర్స్ టెండర్‌కు వెళ్లగా అదే కాంట్రాక్టర్ 0.5 తగ్గించారు. కాంట్రాక్టర్‌తో సంప్రదింపులు జరిపి మరో 0.5 శాతం తగ్గించేలా ఒప్పించడంతో అంచనా వ్యయం కన్నా 3.95 శాతం ఎక్కువ అంటే సుమారు రూ.3.57 కోట్లకు టెండర్ ఖరారైందని ఈఓ వివరించారు. ఈ విషయాన్ని దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ఐవీ రోహిత్‌కు చెప్పగా ఆయన మౌఖికంగా అంగీకారం తెలిపారన్నారు. త్వరలో జరిగే ట్రస్ట్‌బోర్డు సమావేశంలో ఈ టెండర్‌ను ట్రస్టీలు ఆమోదించాక కమిషనర్ అనుమతికి పంపిస్తామని తెలిపారు. నమూనా ఆలయాన్ని నవంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. గతేడాది జూలైలో నమూనా ఆలయం నిర్మాణానికి దేవదాయ మంత్రి కొట్టు సత్యనారాయణ..ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు స్వామివారి నమూనా ఆలయం నిర్మాణానికి చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయని మార్చి 24న సాక్షి దినపత్రికలో 'అదిగో...అల్లదిగో...' శీర్షికన వార్త ప్రచురితమైంది. నవంబరుకల్లా ఈ నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు ఆ వార్త సారాంశం. సాక్షి పేర్కొన్నట్లుగానే పనులు వేగంగా జరుగుతుండడం విశేషం.

ఉద్యానానికి సౌరశక్తి

- 75 శాతం సబ్సిడీపై సౌరశక్తి ఆధార శీతల గోదాముల ఏర్పాటుకు సన్నాహాలు
- జిల్లాలో 1,63,542 హెక్టార్లలో ఉద్యాన పంటలు
- కోల్డ్‌రూంల ఏర్పాటుకు ప్రభుత్వ ప్రోత్సాహం



సాక్షి, రాజమహేంద్రవరం: ఉద్యాన రైతుకు ఊతమిచ్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఉద్యాన ఉత్పత్తులు నిల్వ చేసుకోవడానికి సోలార్ పవర్‌తో పనిచేసే 'కోల్డ్‌రూమ్'(శీతల గోదాము) అందుబాటులోకి తీసుకువస్తోంది. బహిరంగ విపణిలో మంచి ధర ఉన్నప్పుడు విక్రయించుకునేందుకు ఉద్దేశించిన ఈ కోల్డ్‌రూంలకు రాయితీ అందిస్తోంది. తద్వారా నాణ్యత, తాజాదనం దెబ్బతినకుండా ఉంటుంది. పంట ఉత్పత్తులే కాదు వాటి ద్వారా తయారు చేసిన ఉప ఉత్పత్తులను సైతం నిల్వ చేసుకునే వెసులుబాటు కల్పిస్తోంది.

జిల్లాలో ఇలా..

జిల్లా వ్యవసాయ రంగానికి ప్రసిద్ధి. వరితో పాటు 1,63,542.64 ఎకరాల్లో 23 రకాల ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. అందులో ప్రధానంగా ఆయిల్‌పాం, జీడిపప్పు, కొబ్బరి, మామిడి, అరటి చెప్పుకోవచ్చు. ఏటా 7,37,386 మెట్రిక్ టన్నుల సరుకు ఉత్పత్తి అవుతుండగా.. 2.45 మిలియన్ల కొబ్బరి కాయలు ఉత్పత్తి అవుతున్నట్లు ఉద్యాన శాఖ అధికారుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 75,320 మంది రైతులు ఉద్యాన రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పువ్వులు 2,145, కాలీఫ్లవర్ 474.41 ఎకరాల్లో సాగవుతున్నాయి. బొప్పాయి 352 ఎకరాలు, టమాట 286, ఇతర పండ్లు 2,817, కూరగాయలు 2,133 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వీటితో పాటు పెరవలిలో ఆవకాయ పరిశ్రమ నడుస్తోంది. లంక గ్రామాల్లో అరటితో పాటు పండ్ల తోటల సాగు క్రమంగా విస్తరిస్తోంది.

పంట	విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతులు	ఉత్పత్తి (మెట్రిక్ టన్నుల్లో)
ఆయిల్‌పాం	43,190.19	11,293	3,45,521
జీడిపప్పు	27,895.24	12,469	13,389
కొబ్బరి	20,383.50	7,182	2.45 (మిలియన్ టన్నుల కాయలు)
మామిడి	14,753.18	5,926	1,03,272
అరటి	14,680.74	9,677	1,61,488
ఇతర	28,429.07	22,648	1,13,716.28

కోల్డ్ రూంలు లేక నష్టాలు

ఉద్యాన పంటల కోత అనంతరం గ్రేడింగ్, నిల్వ, రవాణా, మార్కెటింగ్ సౌకర్యాలు లేని కారణంగా నష్టాలు వస్తున్నాయి. వీటిని అరికట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకు అనుగుణంగా ఇప్పటికే కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసింది. అక్కడ ఉత్పత్తులు నిల్వ ఉంచుకునే వెసులుబాటు కల్పి స్తోంది. పండ్లు, కూరగాయలు పండించే రైతులు నిల్వ ఉంచుకుంటే సరుకు పాడైపోతోంది. చేసేది లేక కోత కోసిన వెంటనే మార్కెట్‌లో ఉన్న ధరకు విక్రయిస్తున్నారు. రైతు వద్ద నిల్వ చేసుకునే సౌకర్యం లేదని గుర్తించిన వ్యాపారులు పచ్చి సరుకు పాడవుతుందనే సాకుతో ధరలో కోత పెట్టి కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా తీవ్రంగా నష్టపోతున్నారు. కోత ఖర్చులు కూడా రావడం లేదు. ఇలాంటి కష్టాలను అధిగమించేందుకు ప్రభుత్వం కోల్డ్ రూంలకు శ్రీకారం చుట్టింది. కోల్డ్ రూమ్ నిర్మాణం ఫ్రిజ్ తరహాలో ఉంటుంది.

కోల్డ్‌రూమ్‌లను వినియోగించుకోవాలి



కోల్డ్‌రూమ్‌ల నిర్మాణానికి ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రైతులు సంఘంగా ఏర్పడి గ్రామ సచివాయాల్లోని హార్టికల్చర్ అసిస్టెంట్‌ను ఆశ్రయిస్తే అవసరమైన ప్రక్రియ అంతా పూర్తి చేశారు. ఈ విషయమై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. శీతల గోదాములను ఉపయోగాలపై రైతుల్లో చైతన్యం తీసుకువస్తున్నాం.

– వాసిరెడ్డి రాధాకృష్ణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

75 శాతం సబ్సిడీ

సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం (ఎంఐడీహెచ్) కింద ప్రభుత్వం 10 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన కోల్డ్ రూమ్ నిర్మాణానికి రాయితీ కల్పిస్తోంది. గోదాము నిర్మాణానికి రూ.12.50 లక్షలు వ్యయం అవుతుండగా.. 75 శాతం రాయితీగా రూ.9.75 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుంది. శీతల గోదాము నిర్మించుకుంటే ఆయా సీజన్లలో పండే పండ్లు, కూరగాయలు నిల్వ చేసుకోవచ్చు.

అర్హతలు ఇవీ...

కోల్డ్ రూమ్‌లు తీసుకోవాలనే రైతులు తొలుత ఎఫ్‌పీఓ (ఫార్మర్ ప్రొడ్యూజింగ్ గ్రూప్)లుగా ఏర్పడాలి. బృందంలో వంద మంది సభ్యులుండాలి. గ్రూప్‌ను ఉద్యాన శాఖ వద్ద రిజిస్టర్ చేయించుకోవాలి. గ్రామ, వార్డు సచివాలయాల్లోని హార్టికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదిస్తే ప్రక్రియ పూర్తి చేస్తారు. అవసరమైన వాటిపై రైతులకు అవగాహన కల్పిస్తారు. ప్రభుత్వం 75 శాతం సొమ్ము రాయితీగా ఇస్తుండటం కర్షకులకు కలిసివస్తోంది. పసుపు, మిర్చి, కూరగాయలు, పచ్చళ్లు, పండ్లు, పూలు నిల్వ చేసుకునే సౌకర్యం ఉంటుంది. కోల్డ్ రూమ్ సౌరశక్తితో నడుస్తుండటం వల్ల విద్యుత్ చార్జీల భారం కూడా రైతులపై పడదు.

స్కూలు తెరిచే రోజునే జగనన్న విద్యాకిట్లు పంపిణీ

ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ వెల్లడి



కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): వేసవి సెలవుల తర్వాత సోమవారం పాఠశాలలు తెరవనున్న దృష్ట్యా జగనన్న విద్యా కానుక కిట్లు అన్ని స్కూళ్లకూ చేరేలా చర్య లు తీసుకున్నట్లు కలెక్టర్ మాధవీలత, జేసీ ఎన్. తేజ్ భరత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 990 ప్రభుత్వ పాఠశాలల్లో 1,21,730 మంది విద్యార్థులకు కిట్లు అందజేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. 712 ప్రాథమిక పాఠశాలలు, 82 అప్పర్ ప్రైమరీ పాఠశాలలు, 201 ఉన్నత పాఠశాలల్లో 59,370 బాలురకు, 62,360 బాలికలకు అందజేసేందుకు కిట్లను సిద్ధం చేశామన్నారు. కిట్‌లో జత యూనిఫారం, బూట్లు, సాక్సులతో పాటు నోట్‌బుక్‌లు, వర్క్‌బుక్‌లు, నిఘంటువు, ప్యాంటు బెల్ట్, పుస్తకాల ఉన్నాయన్నారు. జిల్లాలో విద్యార్థులకు అందచేస్తున్న కిట్ల కోసం ప్రభుత్వం సుమారు రూ.30 కోట్లకు పైగా వెచ్చించిందన్నారు. సోమవారం పాఠశాలలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో అన్ని మండల ప్రత్యేక అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, తహశీల్దార్లు పాఠశాలలను సందర్శించి ధ్రువీకరించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. పాఠశాలల సందర్శనలో జగనన్న కిట్ల స్టాక్ లభ్యత, తరగతి గదుల సంసిద్ధత, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించి నివేదిక అందజేస్తారన్నారు. జిల్లా విద్యా అధికారి ఎస్. అబ్రహం మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లన్నీ నాణ్యమైన విద్యను అందించే సామర్థ్యం కలిగి ఉన్నాయన్నారు. స్కూల్స్ తెరిచే రోజున పంపిణీ చేసేందుకు వీలుగా మండల స్థాయి స్టాక్ పాయింట్ నుంచి ఆయా స్కూళ్లకు జగనన్న విద్యా కానుక కిట్లు తరలించే బాధ్యతను మండల విద్యా అధికారులు తీసుకుంటున్నారన్నారు. ఒక్కొక్క కిట్ రూ.2500 విలువైందన్నారు. ఇది నాణ్యతతో కూడినదన్నారు. తొలి రోజే ఆయా స్కూల్స్ ప్రధానోపాధ్యాయుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. రాజమహేంద్రవరం శాటిలైట్ సిటీలో జరిగే జిల్లా స్థాయి కిట్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత పాల్గొంటారు.

ఆంగ్లంలో బోధనపై ముగిసిన శిక్షణ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ల్లాలోని ప్రభుత్వ కళాశాల అధ్యాపకులకు ఆంగ్లంలో బోధనపై ఇక్కడి ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. కొత్త విద్యావిధానాన్ని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో ఆంగ్ల మాధ్యమాన్ని తప్పనిసరి చేసిన నేపథ్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోని అధ్యాపకులను సన్నద్ధం చేసేందుకు శిక్షణ నిర్వహించారు. రాజమహేంద్రవరంతో పాటు వివిధ కళాశాలల నుంచి 85 మంది అధ్యాపకులు శిక్షణకు హాజరయ్యారు. శిక్షణ సమన్వయకర్తగా కళాశాల ఎకడెమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ గౌతమ్ వ్యవహరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చప్పిడి కృష్ణ పర్యవేక్షించారు.

క్లుప్తంగా

ఉద్యోగుల మనస్సుల్ని గెలుచుకున్న సీఎం



హరిధర్‌రావు

కాకినాడ రూరల్: ఇటీవలి క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న గొప్ప నిర్ణయాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగుల మనసుల్ని గెలుచుకున్నారని ఉత్తరాంధ్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బడగల హరిధర్‌రావు అన్నారు. రమణయ్యపేటలోని ఏపీఐఐసీ జోనల్ కార్యాలయంలో శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. 12వ పీఆర్సీ వేయడంతో పాటు సుమారు 10 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలని కేబినెట్‌లో నిర్ణయించారన్నారు. అలాగే, కొత్తగా 7 వేల ప్రభుత్వ ఉద్యోగుల నియామకం ద్వారా నిరుద్యోగులకు అవకాశం లభిస్తుందన్నారు.

సీపీఎస్ రద్దు చేసి, అందరికీ ఆమోదయోగ్యంగా జీపీఎస్ విధానం తీసుకురావడం ఆనందించదగ్గ విషయమని, ఇటువంటి నిర్ణయాలు చరిత్రాత్మకమని వివరించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతిలోకి మారిస్తే వారి బతుకులు బాగుంటాయని, సమాన పనికి సమాన వేతనం ఇచ్చినట్టవుతుందని పేర్కొన్నారు. అలాగే వివిధ ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని హరిధర్‌రావు కోరారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయానికి శంకుస్థాపన



వైఎస్సార్ సీపీ కార్యాలయానికి శంకుస్థాపన చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా. చిత్రంలో హోం మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యేలు జ్యోతుల చంటిబాబు, జి.శ్రీనివాసనాయుడు, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు



శంకుస్థాపనలో ఎంపీ మార్గాని భరత్‌రామ్

- ఐదారు నెలల్లో పూర్తి చేస్తామన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- పాల్గొన్న హోం మంత్రి తానేటి వనిత, ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యేలు శ్రీనివాసనాయుడు, చంటిబాబు

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన తండ్రి దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలకు అనుగుణంగా సుపరిపాలన అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. రాజమహేంద్రవరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం సమీపాన సుమారు రెండెకరాల్లో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయానికి శనివారం శంకుస్థాపన జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ ప్రతి పార్టీకీ జిల్లా కార్యాలయం ముఖ్యమన్నారు. ఈ కార్యాలయం నిర్మాణంలో తామంతా భాగస్వాములం అవుతున్నామని చెప్పారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ, పార్టీ ఏర్పాటులో జగన్‌మోహన్‌రెడ్డి పోరాట పటిమ తమకు ఆదర్శమన్నారు. అలాంటి పార్టీలో ఉన్నందుకు గర్వపడుతున్నామని చెప్పారు. జక్కంపూడి రాజా నాయకత్వంలో శంకుస్థాపన జరగడం సంతోషంగా ఉందన్నారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయ నిర్మాణం ఐదారు నెలల్లో పూర్తవుతుందన్నారు. దీనిని సుందరంగా, అధునాతనంగా తీర్చిదిద్దుతామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ అతి తక్కువ కాలంలోనే రాష్ట్ర ప్రజల ఆదరాభిమానాలు చూరగొని అప్రతిహతంగా ముందుకు సాగుతోందని చెప్పారు. పార్టీని పూర్తిస్థాయిలో బలోపేతం చేసే చర్యల్లో భాగంగా జిల్లా కార్యాలయం నిర్మిస్తున్నామన్నారు. నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలు ఎంతో సంతృప్తిగా ఉన్నారన్నారు. గడప గడపకూ వెళ్లినపుడు ఇది వ్యక్తమవుతోందన్నారు. కార్యక్రమంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, మాజీ ఎంపీ గిరజాల స్వామినాయుడు, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, మాజీ కార్పొరేటర్లు, వార్డ్ ఇన్‌చార్జిలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎం జగన్.. ఉద్యోగుల పక్షపాతి



ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగుల పక్షపాతిగా నిలిచారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ కొనియాడారు. ప్రజా సంక్షేమం మాదిరిగానే ప్రభుత్వ, కాంట్రాక్ట్ ఉద్యోగుల ప్రయోజనాల కోసం ఆయన పరితపిస్తున్నారని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఘనత కూడా సీఎం జగన్‌దేనని అన్నారు. గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చుతూ 10,117 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను 10 ప్రభుత్వ శాఖల్లో క్రమబద్ధీకరించారని తెలిపారు. వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు 010 పద్దు కింద జీతాలు ఇచ్చేలా చేయడం, 6,840 కొత్త పోస్టులు మంజూరు చేయడం, 12వ పీఆర్సీకి ఆమోదం తెలపడం వంటి వాటి ద్వారా ఉద్యోగుల పట్ల తనకున్న అభిమానాన్ని ముఖ్యమంత్రి జగన్ మరోసారి వ్యక్తం చేశారని వివరించారు. ఈ మేరకు రాష్ట్ర ఉద్యోగుల తరఫున సీఎంకు ఇజ్రాయిల్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాణం తీసిన వివాహేతర బంధం

- కోరుకొండ యువకుడి హత్య కేసులో వీడిన మిస్టరీ
- 8 మంది నిందితుల అరెస్టు
- చాకు, 7 సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం



నిందితులను చూపుతూ మీడియాతో మాట్లాడుతున్న సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్సై కట్టా శారదా సతీష్

మధురపూడి: యువకుడి హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధమే అతడి హత్యకు దారి తీసిందని నిర్ధారించారు. ఈ కేసులో మొత్తం ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేశారు. కోరుకొండ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్సై కట్టా శారదా సతీష్‌తో కలిసి సీఐ ఉమామహేశ్వరరావు ఈ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. హతుడు ముప్పిడిశెట్టి శ్రీను (34) స్వగ్రామం కోరుకొండ మండలం గాడాల. అతడు కోరుకొండలోని వెంకటగిరి లైటింగ్స్ అండ్ డెకరేటర్స్ సప్లై కంపెనీ యజమాని వెంకటగిరికి అల్లుడు. సప్లై కంపెనీ వ్యవహారాలను శ్రీనే చూసుకుంటున్నాడు. ఈ నెల 4వ తేదీ రాత్రి పశ్చిమ గోనగూడెం రోడ్డులోని ఎస్‌ఆర్ నగర్‌లో ఉన్న సప్లై కంపెనీ గోడౌన్ వద్ద గుర్తు తెలియని దుండగులు అతడి కళ్లల్లో కారం చల్లి, పొట్టలో కత్తులతో పొడిచి, పరారయ్యారు. ఆసుపత్రికి తరలించే లోపే శ్రీను మృతి చెందాడు. దీనిపై అతడి మామ వెంకటగిరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

మూడు నెలలుగా రెక్కీ

కర్నూలు జిల్లా దేవనకొండ గ్రామానికి చెందిన సబ్బు నాగార్జునరెడ్డి అలియాస్ అర్జున్‌రెడ్డి అలియాస్ అర్జున్ అలియాస్ నాగు కోరుకొండలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. ప్రస్తుతం రాజానగరంలో నివాసం ఉంటున్నాడు. నాగార్జునరెడ్డితో పాటు ముప్పిడిశెట్టి శ్రీనుకు కోరుకొండ గ్రామానికి చెందిన వివాహిత కాళ్ల నాగలక్ష్మితో వివాహేతర సంబంధం ఉంది. ఈ నేపథ్యంలో నాగార్జునరెడ్డితో వ్యవహారాన్ని బయట పెడతానంటూ శ్రీను ఆమెను హెచ్చరించాడు. దీంతో విషయం తన భర్తకు తెలుస్తుందని నాగలక్ష్మి భయపడింది. ఈ విషయాన్ని తన స్నేహితురాలు, కోరుకొండకు చెందిన ఫిట్‌నెస్ సెంటర్ నిర్వాహకురాలు ముత్యాల పద్మావతికి చెప్పింది. శ్రీనును హతమారిస్తే తప్ప ఈ సమస్య నుంచి బయట పడలేమని భావించిన వీరిద్దరూ ఈ విషయాన్ని నాగార్జునరెడ్డికి చెప్పారు. దీంతో శ్రీను హత్యకు నాగార్జునరెడ్డి, అతడి మిత్రులు గొడ్డు దిలీప్ (రాజానగరం), చొప్పెల్ల వెంకటేశ్ (రాజానగరం), సయ్యద్ అహ్మద్ (రాజానగరం), ఇంజమూరి రాజేంద్రప్రసాద్ (అనంతపురం జిల్లా గుత్తి – ప్రస్తుతం రాజానగరంలో ఉంటున్నాడు), కొవ్వాడ విజయ్‌కృష్ణ (గుమ్ములూరు, కోరుకొండ మండలం) పథక రచన చేశారు. ఈ నేపథ్యంలో అమెజాన్ నుంచి ఆన్‌లైన్‌లో కత్తి తీసుకున్నారు. మూడు నెలలుగా అదను కోసం వేచి చూస్తున్నారు. రెక్కీ నిర్వహించారు.

వెంబడించి.. హతమార్చి..

గ్రామ దేవత అంకాలమ్మ జాతర సందర్భంగా శ్రీను గత ఆదివారం రాత్రి పశ్చిమ గోనగూడెం రోడ్డులోని సప్లై కంపెనీ గోడౌన్‌కు ఒంటరిగా వెళ్తూ కనిపించాడు. అతడిని నాగార్జునరెడ్డి, గొడ్డు దిలీప్ మోటార్ సైకిల్‌పై వెంబడించారు. గోడౌన్ తలుపు కొట్టి, బయటకు వస్తున్న శ్రీను కళ్లల్లో కారం జల్లారు. నాగార్జునరెడ్డి, వెంకటేశ్‌లు శ్రీను చేతులు పట్టుకోగా దిలీప్ కత్తితో పొడిచి హతమార్చాడు. అనంతరం నిందితులు పరారయ్యారు. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు హతుడు శ్రీను గురించి ఆరా తీశారు. దీంతో వివాహేతర సంబంధం విషయం వెలుగులోకి వచ్చింది. అక్కడ తీగ లాగితే మొత్తం డొంకంతా కదిలింది. నిందితుల సెల్‌ఫోన్ల కాల్‌డేటా, సీసీ కెమెరాల్లోని దృశ్యాల ఆధారంగా నిందితులు నాగార్జునరెడ్డి, దిలీప్, వెంకటేశ్, సయ్యద్ అహ్మద్, ఇంజమూరి రాజేంద్రప్రసాద్‌లను రాజానగరంలో అరెస్టు చేశారు. అలాగే కోరుకొండలో నాగలక్ష్మిని, పద్మావతిని, గుమ్ములూరులో కొవ్వాడ విజయ్ కృష్ణను అరెస్టు చేశారు. వారి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, రెండు మోటార్ సైకిళ్లు, ఒక కారు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి సూచన మేరకు, డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఎస్సై కట్టా శారదా సతీష్, తన సిబ్బందితో వివిధ బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేసి, ఈ కేసు మిస్టరీని ఛేదించారు. సాంకేతిక నిపుణుల సహాయం తీసుకున్నారు. వీరిని ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి, ఉన్నతాధికారులు అభినందించారు.

మరదలిపై హత్యాయత్నం

- ఆపై రైలు కింద పడి బావ ఆత్మహత్య
- రెండు కుటుంబాల్లో విషాదం నింపిన క్షణికావేశం



సత్యనారాయణ (పాత చిత్రం)

నల్లజర్ల: క్షణికావేశంలో మరదలిపై హత్యాయత్నానికి ఒడిగట్టి, ఆత్మహత్యకు పాల్పడ్డాడు ఓ యువకుడు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతినీడుపాలెంలో శుక్రవారం రాత్రి జరిగిన ఈ సంఘటన రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై శ్రీహరిబాబు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఏలూరు జిల్లా భీమడోలుకు చెందిన పెదపూడి సత్యనారాయణ (33) చిన్నతనం నుంచీ పోతినీడుపాలెంలోని మేనమామ ఇంట పెరిగాడు. మేనమామ తన పెద్ద కుమార్తెకు, సత్యనారాయణకు మూడేళ్ల కిందట వివాహం చేశాడు. సత్యనారాయణ 'సాయి శ్రీనివాసా' పేరిట బ్యాండు ట్రూపు ఏర్పాటు చేసి, మేనమామ ఇంట్లోనే నివసిస్తున్నాడు. ఈ ట్రూపులోనే సత్యనారాయణ మేనమామ రెండో కుమార్తె పాటలు పాడేది. ఈ క్రమంలో బావకు, ఆమెకు మధ్య ప్రేమ వ్యవహారం మొదలైందని పోలీసులు చెబుతున్నారు. ఇటీవల ఆమెకు పెళ్లి కుదిరింది. వరుడు కొనిచ్చిన సెల్‌ఫోన్‌లో ఆమె తరచూ మాట్లాడుతూ బావకు దూరంగా ఉంటోంది. తనకు ఆమె దూరమవుతోందని సత్యనారాయణ అక్కసు పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో మాట్లాడే పని ఉందంటూ ఆమెను గ్రామంలోని కానూరి సత్యనారాయణ పామాయిల్ తోటకు శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో తీసుకువెళ్లాడు. అక్కడ ఇద్దరి మధ్య ఏం జరిగిందో ఏమో కానీ ఆమె మెడపై సత్యనారాయణ కత్తితో పొడిచాడు. చనిపోయిందని భావించి బైక్‌పై అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం చాటపర్రులోని ఉన్న తన సోదరి ఝాన్సీకి ఫోన్ చేశాడు. తన మరదలిని చంపేశానని, తాను కూడా రైలు కింద తల పెట్టి చనిపోతానని, తన గురించి వెతకవద్దని చెప్పి, ఫోన్ పెట్టేశాడు. దీంతో ఝాన్సీ తన బంధువులందరినీ అప్రమత్తం చేసింది. భీమడోలు మండలం కొండ్రుపాడు రైల్వే గేటు వద్ద రాత్రి 11 గంటల సమయంలో రైలు కింద పడి సత్యనారాయణ ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి బైక్ కూడా అదే ప్రాంతంలో లభ్యమైంది. ఝాన్సీ ఇచ్చిన సమాచారంతో సత్యనారాయణ మేనమామ కుటుంబ సభ్యులు సమీపంలోని అన్ని పామాయిల్ తోటల్లో గాలించారు. రెండు గంటల అనంతరం రక్తపు మడుగులో ఉన్న బాధిత యువతిని గుర్తించి, ప్రత్యేక వాహనంలో తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. తన కుమార్తెపై అల్లుడే దురాగతానికి పాల్పడ్డాడని తెలిసి ఆమె తల్లి సొమ్మసిల్లి పడిపోయింది. ఆమెను కూడా ప్రత్యేక వాహనంలో తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని నల్లజర్ల సీఐ నున్న రా జు, ఎస్సై నరసింహమూర్తి శనివారం ఉదయం సందర్శించారు. తమ రెండో కుమార్తెకు పెళ్లి కుదిరిందని, ఈ నేపథ్యంలో బ్యాండు ట్రూపులో పాటలు పాడనని చెప్పడంతో అల్లుడు సత్యనారాయణ ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశా రు. దీని ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు.